ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం

మన్సూరాబాద్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధి భవానీనగర్, శ్రీరామాహిల్స్, గణేష్‌నగర్ కాలనీల్లో గురువారం ఆయన మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిపోతున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. గణేష్‌నగర్ కాలనీలో వరద కాలువ నీటి పనులు నత్తనడకన సాగుతున్నాయని, డ్రైనేజీలు పొంగుతున్నాయని ఫిర్యాదు చేసినా సీవరేజ్ బోర్డు అధికారులు పట్టించుకోవటంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణమే మ్యాన్‌హోళ్లకు మూతలు ఏర్పాటు చేయాలని కోరారు. పనామా వద్ద ఆర్ అండ్ బీ చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, పద్మారావు, రాజశేఖర్, జైపాల్‌రెడ్డి, నర్సింహ, జవాన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పనామా వద్ద జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

డ్రైనేజీలు పొంగకుండా చర్యలు తీసుకోండి



నాగార్జున కాలనీలో జలమండలి అధికారులకు డ్రైనేజీ సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం: వర్షాలకు పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి జలమండలి అధికారులను కోరారు. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు డివిజన్ పరిధిలోని నాగార్జున కాలనీ, క్రిస్టియన్ కాలనీ పరిసర కాలనీల్లో డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు ఫిర్యాదు చేయడంతో గురువారం ఆయన జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం రాజగోపాల్, మేనేజర్ భవ్య, జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రజ్ఞ తదితర అధికారులతో కలిసి ఆయా కాలనీల్లో పర్యటించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీల్లో డ్రైనేజీలు పూడుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వారికి సూచించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు లట్టుపల్లి మోహన్‌రెడ్డి, నాయిని శ్రీకాంత్‌రెడ్డి, హరీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌తోనే సరి



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

- మే నెలలో సస్పెన్షన్‌కు గురైన ఇక్కడి కమిషనర్
- ఇన్‌చార్జి కమిషనర్‌గా మీర్‌పేట కమిషనర్‌కు అదనపు బాధ్యతలు
- పని ఒత్తిడితో సమయం కేటాయించలేకపోతున్న వైనం
- సకాలంలో పనులు కాక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తుర్కయంజాల్: పురపాలక సంఘానికి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ ఇదివరకు కమిషనర్‌గా పనిచేస్తున్న బి.సత్యనారయణ రెడ్డి మే 21న సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. దీంతో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఇక్కడి అదనపు బాధ్యతలను సీడీఎంఏ కేటాయించింది. దీంతో ఆయన రెండు చోట్లా పనిచేయాల్సి రావడంతో తుర్కయంజాల్‌కు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. దీంతో పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. రోజుల తరబడి తిరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

అనుమతుల జారీలో జాప్యం..

భవన నిర్మాణ అనుమతులు, అసెస్‌మెంట్, మ్యూటేషన్, బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ వంటి వాటికి రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా వాటిని జారీ చేయాల్సి ఉన్నప్పటికీ పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇన్‌చార్జి కమిషనర్ కార్యాలయానికి సమయం కేటాయించకపోవడం, పని ఒత్తిడితో ఎక్కడిక్కడ ఫైల్‌లు పేరుకుపోయాయి. కార్యాలయ సిబ్బంది ఫైల్స్ పట్టుకుని మీర్‌పేటకు రోజూ తిరగాల్సి వస్తోంది.

శానిటేషన్ అస్తవ్యస్తం..

మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో శానిటేషన్ అస్తవ్యస్తంగా మారింది. పలు కాలనీల్లో రోడ్ల పక్కన చెత్తను ఇష్టానుసారంగా వేస్తుండటంతో డంపింగ్ యార్డ్‌లుగా మారుతున్నాయి. సిబ్బందిపై పర్యవేక్షణ కరువైంది. ఇటీవల తుర్కయంజాల్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఓ వ్యక్తిపై కుక్క దాడి చేయడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. అదే కుక్క 10రోజుల తర్వాత గాయపడిన వ్యక్తి తల్లిని కూడా కరిచి గాయపరించింది. అయినప్పటికీ అధికారుల స్పందన కరువైంది.

కోడ్ ముగియడంతో..

లోక్‌సభ ఎన్నికల కోడ్ ఈనెల 6 తేదీ (గురువారం)తో ముగిసింది. సీడీఎంఏ అధికారులు పూర్తిస్థాయి కమిషనర్‌ను కేటాయించడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన పలువురు మరోసారి ఇక్కడికి రావడానికి ఇప్పటికే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. వెంటనే అధికారులు స్పందించి పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రవేశాల పెంపే లక్ష్యం

- 'బడిబాట' షురూ
- ఈనెల 19 వరకు కార్యక్రమం
- సర్కారు స్కూళ్లలో ప్రవేశాల నమోదుకు ప్రణాళికలు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ అధికారులు



'బడిబాట'లో డ్రాపౌట్ అయిన విద్యార్థులను గుర్తిస్తున్న మలక్‌పేట ఉపాధ్యాయులు

చాదర్‌ఘాట్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపే లక్ష్యంగా బడిబాట కార్యక్రమం గురువారం నుంచి మొదలైంది. 2024–2025 విద్యా సంవత్సరం ఆరంభానికి ముందు ఈనెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మలక్‌పేట నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, అక్బర్ బాగ్, సైదాబాద్ డివిజన్లలోని 15 ప్రభుత్వ ఉన్నత, 25 ప్రాథమిక పాఠశాలల పరిధిలో బడిబాట కార్యక్రమం షురూ అయింది.



మూగ, చెవిటి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

- మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయక బృందాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, యువజన సంఘాలు, బస్తీ కమిటీల సాయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

బడిబాటలో ఏం చేయాలి..

- ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఆరు రోజుల పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం బస్తీల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లలతో పాటు తల్లిదండ్రులను కలవాలి.
- ఈనెల 10–12 తేదీల్లో పాఠశాల ఆవరణ తరగతి గదులను శుభ్రం చేసి నీటి వసతిని పరిశీలించి పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి.
- 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసిన అమ్మాయిలకు ఉన్నత విద్య కెరీర్‌పై అవగాహన కల్పిస్తారు.
- రోజూ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఇది మన బడి అంటూ ప్రజలను కార్యక్రమంలో భాగస్వాములను చేస్తారు.
- 5, 7 తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత తరగతుల్లో నమోదు చేస్తారు.
- విద్యార్థులందరినీ బడికి రప్పించడం, వారిని చదువుకునేలా చేయడంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందుబాటులో ఉండాలే ప్రణాళిక సిద్ధం చేస్తారు.
- అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న ఐదేళ్లకు పైబడిన చిన్నారులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం.
- ప్రభుత్వ పాఠశాలలో నమోదు సంఖ్య పెంచడం, గుణాత్మక విద్యను అందించేందుకు కృషి చేయడం.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 47, వంకాయ 23, బెండ 38, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 21, క్యారెట్ 40. దొండ 18, ఆలు 33, ఉల్లి 29, గోకర 45, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 65, అర్వి 40, మునగ 45, చిలగడదుంప 45, బీట్‌రూట్ 23, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 115, కాప్సికమ్ 65. ఈ ధరలు శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

తల్లోజు ఆచారికి జన్మదిన శుభాకాంక్షలు



మన్సూరాబాద్: బీజేపీ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారికి ఆ పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మన్సూరాబాద్‌కు చెందిన నాయకుడు దేవరకొండ లింగాచారి ఆధ్వర్యంలో గురువారం తల్లోజు ఆచారిని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మందుల విద్యాసాగర్, కరాటే శ్రీను, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నాగేశ్వరరావు

సైదాబాద్: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన సైదాబాద్‌పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన కె.నాగేశ్వరరావు (62) సైదాబాద్ కరణ్‌బాగ్‌లోని సోదరి ఇంట్లో 2016 నుంచి ఉంటున్నాడు. గత నెల 30న అతను ఇంటి నుంచి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం బంధువులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ హ్యాట్రిక్ విజయంపై లీగల్ సెల్ హర్షం



ప్రవీణ్‌యాదవ్‌కు మిఠాయిలు తినిపిస్తున్న న్యాయవాదులు

మలక్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ సాధించడంపై ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్, అడ్వకేట్ ఆవుల ప్రవీణ్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో సిటీ సివిల్ కోర్టు, దిల్‌సుఖ్‌నగర్, శాలివాహననగర్, గాంధీనగర్‌ల్లో గురువారం న్యాయవాదులు సంబురాలు జరుకున్నారు. టపాసులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆవుల ప్రవీణ్‌యాదవ్ మాట్లాడుతూ, నరేంద్ర మోదీ పాలనపై అన్ని వర్గాల ప్రజలకు అపారమైన విశ్వాసం ఉందని, దేశాభివృద్ధి కోసం మూడోసారి బీజేపీకి పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో భగత్, మాణిక్, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఇసుక మేటల తొలగింపు



ప్రధాన రహదారిపై ఇసుక మేటలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

బడంగ్‌పేట్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారుల్లో చాలా చోట్ల ఇసుక మేటలు పేరుకపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీన్ని గుర్తించిన బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నైరుతి రుతుపవనాలు తెలంగాణను తాకడంతో వాతావరణం చల్లబడిందన్నారు. అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో కూడా వర్షాలు కురుస్తున్నాయన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై చెత్తాచెదారం చేరడమే కాకుండా ఇసుక పేరుకపోతుందన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించి సిబ్బందితో ఇసుకను ఎత్తివేయిస్తున్నామన్నారు. వారం క్రితం ఎమ్మార్వో కార్యాలయం వద్ద, అలాగే పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ ఎదురుగా ప్రధాన రహదారిలో కొత్త మున్సిపల్ కార్పొరేషన్ మూల మలుపు వద్ద ఇసుక పేరుకపోయిందన్నారు. గుర్తించిన అధికారులు వెంటనే ఇసుకను ఎత్తివేయించారన్నారు. ఇటీవల ఈ ఇసుక మేటల వల్ల బైకులు అదుపుతప్పిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని గమనించిన కార్పొరేషన్ అధికారులు ప్రధాన రహదారిలో ఎక్కడ ఇసుక పేరుకుపోయినా వెంటనే గుర్తించి పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించే పనులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రమాదాలను నివారించేందుకు సిబ్బంది చేస్తున్న సేవలను వాహనదారులు, పలు కాలనీల వాసులు హర్షం వక్తం చేస్తున్నారు.

మొఘలులను ఎదిరించిన ధీశాలి ఛత్రపతి శివాజీ



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా రాజ్యాభిషేక్ దినోత్సవం

పహాడీషరీఫ్: మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన గొప్ప ధీశాలి ఛత్రపతి శివాజీ మహరాజ్ అని శివసేన యూత్ అసోసియేషన్ ప్రతినిధులు కొనియాడారు. శివాజీ రాజ్యాభిషేక్ దినోత్సవం సందర్భంగా గురువారం జల్‌పల్లి శ్రీరాం కాలనీలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శివాజీ తన జీవితకాలంలో మొఘల్ సామ్రాజ్యం, గోల్కొండ సుల్తాన్లు, బీజాపూర్ సుల్తాన్లు, యూరోపియన్ వలస శక్తులతో పోరాడారని అన్నారు. సామ్రాజ్యం తరఫున ఎన్నో సైనిక దండ యాత్రలను ఎదుర్కొన్నారన్నారు. పురాతన హిందూ రాజకీయ సంప్రదాయాలు, కోర్టు సమావేశాలను పునరుద్ధరించిన ఘనత శివాజీకే దక్కుతుందన్నారు. నేటి తరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, అసోసియేషన్ సభ్యులు శాంత కుమార్, షేర్ సింగ్, అంబదాస్, నర్సింగ్ బిరాదర్, రాహుల్ బిరాదర్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన ప్రక్రియను ప్రారంభించాలి



బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వెంటనే కులగణన ప్రక్రియను ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. గురువారం ఆయన కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ పక్షాన నిలిచి రాష్ట్రంలో 8 పార్లమెంట్ స్థానాలలో అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు కృషి చేశారన్నారు. బీసీ కులాల వారీగా జనాభా లెక్కలు తీసి రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థ ఎన్నికలను నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

డంపింగ్ కేంద్రాలుగా ఖాళీ ప్రదేశాలు

- రోడ్లు, ఖాళీ ప్లాట్లలో చెత్తను పడేస్తున్న జనం
- తొలగించని పారిశుద్ధ్య సిబ్బంది
- ప్లాస్టిక్ మయంగా రోడ్లు



ఇంజాపూర్ రోడ్డు పక్కన దర్శనమిస్తున్న చెత్త



హయత్‌నగర్: ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కొందరు ఇష్టానుసారంగా చెత్తను పడేస్తున్నారు. ఖాళీ ప్లాట్లు, రోడ్లకు ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేస్తుండటంతో హయత్‌నగర్ డివిజన్‌లో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారుల నిర్లక్ష్యంతో సిబ్బంది చెత్తను తొలగించడంపై అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. హయత్‌నగర్ నుంచి మునుగనూరు, కుంట్లూర్, సాహెబ్‌నగర్ వెళ్లే దారులకు ఇరువైపులా చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పలు కాలనీలలో ఉన్న ఖాళీ ప్రదేశాలు, కుమ్మరికుంట, బాతుల చెరువుల్లో చెత్తను వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు చెత్తను పడేస్తున్నారు. చెత్తను పడేసేందుకు వాడుతున్న ప్లాస్టిక్ సంచుల కారణంగా రోడ్లన్నీ ప్లాస్టిక్ మయంగా మారుతున్నాయి. రోడ్ల పక్కన చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డీకే అరుణను కలిసిన మలక్‌పేట నేతలు



డీకే అరుణను సన్మానిస్తున్న దినేష్, సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా విజయం సాధించిన డీకే అరుణను మూసారంబాగ్ బీజేపీ నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, మూసారంబాగ్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల దినేష్ ఆమెను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ అధికార ప్రతినిధిగా రవికిరణ్



రవికిరణ్‌కు నియామకపత్రం అందజేస్తున్న సామ రంగారెడ్డి

హయత్‌నగర్: బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధిగా హయత్‌నగర్ డివిజన్‌కు చెందిన పానుగుపాటి రవికిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు రవికిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ నిర్ణయాలతో జిల్లాలో పార్టీ క్రమక్రమంగా బలపడుతోందని, జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

అందరూ సేవాదృక్పథం అలవర్చుకోవాలి



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న రమేష్‌గుప్తా తదితరులు

మలక్‌పేట: సామాజిక సేవలో పాలు పంచుకోవడం ఎంతో ఆనందం, సంతృప్తిగా ఉంటుందని ఆర్యవైశ్య సంఘం మలక్‌పేట అధ్యక్షుడు వనపర్తి రమేష్‌గుప్తా అన్నారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం మలక్‌పేట డీమార్ట్ వద్ద ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఫౌండర్ ప్రెసిడెంట్ జైని రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్‌గుప్తా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రాజెక్టు చైర్మన్ రాజలింగం, జగన్మోహన్, సుధాకర్‌గుప్త, వనపర్తి సురేష్, ఎడవల్లి అశోక్, పాలడుగు వినోద్‌కుమార్, మోహన్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో..

పహాడీషరీఫ్: అమావస్య సందర్భంగా పహాడీషరీఫ్‌లోని పోచమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కేఎస్ ప్రశాంత్, సూర్యగౌడ్, శంకర్ యాదవ్, ఈదులకంటి విశాల్ గౌడ్, చింటూ, నవీన్ చారి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్: సురక్షా సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం వ్యవ స్థాపక అధ్యక్షుడు గోపీశంకర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి ఆపరేషన్లు చేయించుకోవాలనుకే వారు 7330892 709 నంబర్‌కు ఆధార్ కార్డు ఫొటోను వాట్సాప్ ద్వారా పంపించాలని ఆయన కోరారు.

సమష్టి కృషితోనే ప్లాస్టిక్ నియంత్రణ



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న రంగయ్య

కాచిగూడ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తరిమికొట్టేందుకు చేతులు కలపాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన 'మేము సైతం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసే సింగిల్ యూజ్ బ్యాగులను పూర్తిగా నిషేధించాలన్నారు. అనేక మంది మిగిలిన ఆహారపదార్థాలను ఈ ప్లాస్టిక్ సంచుల్లో ఉంచి పడవేయడం వల్ల మూగ జీవాలు తిని ప్రాణాలు కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వల్ల కలిగే హానిపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాల్లో పోస్టర్లను అంటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా ప్లాస్టిక్ నియంత్రణకు చట్టాన్ని పటిష్టం చేయాలన్నారు.

మహిళ ఆత్మహత్య

మల్లాపూర్: మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ నెహ్రూనగర్‌కు చెందిన జోగు కృష్ణ భార్య జోగు బుచ్చమ్మ(50)కు కొంత కాలంగా మతిస్థిమితం సరిగ్గా లేదు. గురువారం ఉదయం ఇంట్లోంచి మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలోని ధోబీఘాట్‌కు చేరుకొని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జూనియర్ కాలేజీలో దరఖాస్తులకు ఆహ్వానం

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న కోర్సులతో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, బోత్‌మీడ్, సీటి, ఏఈటి, ఈసీటీతో పాటు నూతనంగా ఈ వార్షిక సంవత్సరం నుంచి ఎంఈసీ ఈఎం కోర్సు అందుబాటులోకి వచ్చిందని ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతిర్మయి తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

జేబీఎస్ నుంచి ఈసీఐఎల్‌కు బస్సు ప్రారంభం

అల్వాల్: సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి అమ్ముగూడ, సైనిక్‌పురి మీదుగా ఈసీఐఎల్‌కు 24ఈ నంబర్ బస్సు ప్రారంభమైంది. బుధవారం రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్ ప్రజల సౌకర్యార్థం ఐదు బస్సులను జేబీఎస్, అమ్ముగూడ, సైనిక్‌పూరి మీదుగా సికింద్రాబాద్-ఈసీఐఎల్‌కు 24ఈ నంబర్ గల బస్సును ప్రారంభించామని డిపో మేనేజర్ శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు ఆర్టీసీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఐదు బస్సులను నాలుగు ట్రిప్పుల చొప్పున ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు.